


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 09.01.2026 | సంపుటి : 2 | సంచిక :334 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 09.01.2026 | volume : 2 | Issue : 334 | Pages : 8 | Cost : 2/- |




## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

భారత్‌పై పేలనున్న

## ట్రంప్ బాంబ్

ఏకంగా 500 శాతం సుంకాల విధింపునకు రెడీ

బిల్లును సిద్ధం చేసిన అమెరికా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో బాంబు వేసేందుకు రెడీ అవుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఏకంగా 500 శాతం సుంకాలు విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్స్ గ్రాహం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ట్రంప్‌తో జరిగిన భేటీలో పలు కీలక విషయాల గురించి చర్చలు జరిపినట్టు తెలిపారు.

06



04

బిచ్చగాడి మృతి..
4.5 లక్షల నగదు లభ్యం

పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్, జనవరి 8 : ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

-మిగతా 2 లో..



# పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ

## ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

- అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు
- ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు
- పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం
- కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ

## పాఠశాలల బలోపేతం

- చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రవాణా సౌకర్యం
- తెలంగాణలో విద్యా విధానంపై సీఎం రేవంత్ వివరణ
- హిమాచల్ విద్యామంత్రి రోహిత్ కుమార్ భేటీలో వివరాలు వెల్లడి



మరోమారు ప్రజల్లోకి

## వెళ్లేలా ప్రణాళిక



- మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం
- ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్
- ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు సభల నిర్వహణ
- సభల నిర్వహణ బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగింత

హైదరాబాద్,జనవరి8: రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి

-మిగతా 2 లో..



చైనా మాంజాపై

## పోలీసుల ఉక్కుపాదం

పెద్ద ఎత్తున నిల్వలు స్వాధీనం

03



రెండు లక్షల ఉద్యోగాల

## హామీ ఏమయ్యింది

మరోమారు రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

04



# మేడారం జాతరకు రండి

## కేసీఆర్ దంపతులకు మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఆహ్వానం

- మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు
- చీరసారెతో దంపతుల సత్కారం
- యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కేసీఆర్
- మేడారం ఆహ్వాన పత్రిక అందచేసిన మంత్రులు

ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం పలికారు.

02

# ప్రజలను మోసం చేశారు

- పాలమూరు-రంగారెడ్డికి విభజన చట్టంలో ప్రతిపాదన ఏదీ
- పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తోడితే కెసిఆర్ ఏం చేశారు
- కేసీఆర్ 229 టీఎంసీలు చాలని సంతకం పెట్టలేదా?
- జగన్‌తో కలసి ఏం మాట్లాడారో బయటపెట్టాలి
- ఆనాడు మేం నిలదీస్తే విమర్శలు చేశారు
- మీడియా సమావేశంలో బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు.

కరీంనగర్, జనవరి 8 : కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82



04

## మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొన్న విద్యార్థుల కారు

నలుగురు విద్యార్థుల దుర్మరణం

రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

ఆందోళన చేస్తున్న వారిపై

# పోలీసుల దాష్టీకం

- నిరుద్యోగులపై దమనకాండ దారుణం
- జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన రేవంత్
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, జనవరి 8 : నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు

-మిగతా 2 లో..

రాష్ట్రంలోకి హెచ్‌టి పత్తి

# విత్తనాలు రావొద్దు

## రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోండి

- టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు
- అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 8 : రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని

-మిగతా 2 లో..



## బాగున్నారా.. అమ్మా..

**గజ్వేల్, జనవరి 8 :** ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేసీఆర్‌కు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు. తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షేమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

## మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఖరారు చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలుపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లను జైలుకు పంపాలని కుట్ర

### ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపణ



**హైదరాబాద్ :** మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా పార్టీ సీనియర్ నేతలను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపాలని భారీ కుట్ర జరుగుతోందని భారాస ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సమస్యలపై పోరాటం చేస్తున్న భారాసకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఆయన గురువారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ఏ1గా చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల పేర్లు చెప్పాలని ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతోపాటు చాలా ఇబ్బంది పెడుతున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆయనను 14 రోజులపాటు పోలీస్ కస్టడీలో విచారించారు. ఇప్పుడు మంత్రుల ఫోన్లను ముఖ్యమంత్రి ట్యాప్ చేయడం లేదా? సీఎం మెప్పు కోసం అడ్డదారులు తొక్కడం మంచిది కాదని పోలీసు అధికారులకు సూచిస్తున్నా' అని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

(మొదటిపేజీ తరువాయి)




ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

## కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)



ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించ లేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసిందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది.. ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి ఇరిగేషన్ విషయంలో అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. మేము నదీజలాలపై కొట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫీల్డ్ లో లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అండగా ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తామే ప్రారంభించామని కాంగ్రెస్ అంటోంది.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పాలమూరు రంగారెడ్డి పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇది మరణశాసనం. వాళ్లే జాతీయ హోదా ఇవ్వలేదు అని లొల్లి చేస్తూన్నారన్నారు. రీ ఆర్గనైజ్ యాక్ట్ లో 6 ప్రాజెక్ట్ లు మాత్రమే ఉన్నాయి.. పునర్విభజన చట్టంలో లేని పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఎలా ఇస్తారు..? అని నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందన్నారు.. పోతిరెడ్డిపాడు విషయంలో ఆ రెండు పార్టీలు నోరు మెదపలేదు. కేసీఆర్ ప్రకటనలకు పరిమితం అయ్యారని బండి సంజయ్ అన్నారు.. కృష్ణా నది మీ జాగీరా? అణు బాంబు అయితా అన్నాడు కేసీఆర్.. అణుబాంబు కాదు తోక పటాక్ కూడా కాలేదు. ఉమాభారతి సమక్షంలో జరిగిన మీటింగ్ లో 299 టిఎంసిలు కృష్ణా నదిలో వాటా చాలు అన్నారు. దానికి కేసీఆర్ వద్ద సమాచారం లేదు. తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం చేసింది కేసీఆర్? ఈ విషయాన్ని నేనే బయట పెట్టాను.. వెంటనే నేను అన్నది తప్పు అన్నారు కేసీఆర్. ఆంధ్ర వాళ్ళతో కమిట్ అయ్యి.. ఇక్కడ ఉల్టా డైలాగులు కొట్టారు. కాళేశ్వరం అని రూ. లక్ష కోట్లు మింగి కూలేశ్వరం కట్టారు. రెండవ దఫాలో కృష్ణా మీద కన్నేసి.. పాలమూరు రంగారెడ్డి కి సిద్ధమయ్యారు. రూ. 80వేల కోట్ల అంచనాతో మొదలు పెట్టి రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశారు. ఇరవై ఏడువేల కోట్లు పెడితే చుక్క నీరు రాలేదు. లిఫ్టులు రిజర్వాయర్ల కోసం రూ. 80 వేల కోట్లు అని.. ఓ అంచనా లేకుండా రూ. లక్ష 50వేల కోట్లు ఖర్చు అయి ఉంటాయి అన్నారు. కృష్ణా జలాల విషయంలో 2016, 2020 లో రెండుసార్లు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. మొదటిసారి మిస్టేక్ అనుకుందాం? రెండోసారి మీటింగ్ 2020 లో జరిగింది?. అప్పుడైనా సరిదిద్దుకోవాలి కదా.. ఆ మీటింగ్ లో కూడా 299 టీఎంసీలకే ఒప్పుకున్నారు.. జగన్ ప్రగతి భవన్ కి వచ్చారు.. ఇద్దరూ కలిసిన విషయం ఫార్మాలిటీ అన్నారు.. ఆనాడు నేను ప్రశ్నిస్తే నన్ను విమర్శించారు. వెంటనే బేసిన్లు లేవు భేషజాలు లేవు అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల జరుగుతుంటే ఆపలేదు. రోజా ఇంటికి పోయి రొయ్యల కూర చేపల పులుసు తిని వచ్చారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తా అని చెప్పి.. పెద్దన్న పాత్ర పోషిస్తా అన్నారు. కవిత కూడా ఆ రోజు పట్టుబట్టలు పెట్టారు. ఆరోజు జరిగిన సమావేశంలో ఏమి జరిగిందో కవిత బయటపెట్టాలని బండి డిమాండ్ చేశారు. బీజేపీ అండ ఉంది. కవిత దావత్ వద్దన్నదని నాకు సమాచారం ఉంది. ఇప్పుడు చెప్పాలి? రోజా ఇంట్లో నాన్ వెజ్ తిని తిరుమల యాత్ర రద్దు చేసుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల విషయంలో అన్యాయాన్ని నిరసిస్తూ మేము ఇళ్లపై నల్లజెండాలు ఎగరవేశాం.. అని సంజయ్ వెల్లడించారు.

## హెచ్‌టి పత్తి విత్తనాలను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)



హెచ్‌టి పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్శాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం మరియు దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రిగారు తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ఊ÷ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టి÷డ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ఊ÷ు విత్తనాలు మరియు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రి రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయశాఖ అధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులపై దమనకాండ దారుణం

(మొదటిపేజీ తరువాయి)

అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథాలయాల్లో పోలీసులు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఈ రోజు గాయపడిన ప్రతి నిరుద్యోగికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిర్బంధాలను ఆపి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులను లాకప్ హింసకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగ సోదరులను భేషరతుగా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## డీజీపీ నియామక వివాదంపై నేడు ఉత్తర్వులు

**హైదరాబాద్:** డీజీపీగా శివధర్‌రెడ్డి నియామకం చట్టవిరుద్ధంగా జరిగిందన్న వివాదంపై హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయనుంది. ప్రకాశ్‌సింగ్ బాదల్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా డీజీపీ బి.శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాలు చేస్తూ సామాజిక కార్యకర్త టి.ధన్‌గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఇదే హైకోర్టు గత విచారణ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు యూపీఎస్సీకి డిసెంబరు 31న తాజాగా జాబితాను పంపినట్లు తెలిపారు. ఆలస్యంగా పంపారంటూ జాబితాను యూపీఎస్సీ తిరస్కరించిందన్నారు. ఏపీ ప్రభుత్వం 11 ఏళ్ల తరువాత జాబితాను పంపిందని, దీనికి యూపీఎస్సీ ఆమోదించిందన్నారు. గతంలో యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి 4 సార్లు లేఖలు రాసిందని, ఎప్పుడూ జాప్యం ప్రస్తావన తీసుకురాలేదన్నారు. తాజాగా జాబితాను పంపుతూ జాప్యం జరిగిందని చెబుతోందన్నారు. యుపీఎస్సీ తరఫు న్యాయవాది కులకర్ణి వాదనలు వినిపిస్తూ యూపీఎస్సీకి ఏడేళ్ల తరువాత రాష్ట్ర ప్రభుత్వం జాబితా పంపిందన్నారు. అందువల్ల జాబితాను వెనక్కి పంపినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

- చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రవాణా సౌకర్యం
- తెలంగాణలో విద్యా విధానంపై సీఎం రేవంత్ వివరణ
- హిమాచల్ విద్యామంత్రి రోహిత్ కుమార్ భేటీలో వివరాలు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 8 :** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని త్వరలో తెలంగాణలో అమలు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్‌క గురువారం సిఎం రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇక్కడి విద్యావిధానంపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని సైతం కల్పించే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయనకు రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని హిమాచల్‌ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న విద్యా విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి రోహిత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మ్లలెపల్లిలోని ఐటీఐని సందర్శించాలని మంత్రి రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు కానున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై రోహిత్ కుమార్ ఆసక్తి కనబరిచారు. స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి.. సమగ్ర నివేదికను తమకు అందించాలని ఈ సందర్భంగా



సీఎం రేవంత్‌ను హిమాచల్ ప్రదేశ్ మంత్రి కోరారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రేవంత్ రెడ్డి విజన్‌ను రోహిత్ కుమార్ అభినందనలతో ముంచెత్తారు. ఈ రాష్ట్ర విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియ ల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సోదాహరణతో రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి వివరించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు ఆయనకు సీఎం రేవంత్ వివరించారు. అందుకు సంబంధించి ఒక కమిటీని నియ మించామని.. త్వరలోనే పాలసీని తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డితోపాటు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన గుత్తా

**నల్లగొండ, జనవరి 8 :** నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన రూ.12.50 లక్షల విలువ గల చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమని, ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, జనవరి 8 :** ఆంధ్రప్రదేశ్‌లో 2016–2020 మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏపీ విభజన తర్వాత విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ప్రత్యేక పోలీస్ స్టేషన్‌గా అధికారికంగా నోట్గి÷ చేయలేదన్న టెక్నికల్ కారణంతో హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు ఆదేశాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించి ంది. కేసులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయ వాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. ఇలాంటి టెక్నికల్ కారణాలతో దేశ వ్యాప్తంగా అనేక అవినీతి కేసులు హైకోర్టుల్లో పెండిం గ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ తీర్పు మైలురాయిగా నిలుస్తుంది.

## ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ

**వరంగల్, జనవరి 8 :** రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్స్పెక్టర్ పి. శ్రీకాంత్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల ఒక కేసులో పట్టుబడ్డ వ్యక్తి తనపై వెంటనే చార్జ్‌షీట్ నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని, మె-ంబైల్ ఫోన్‌ను తనకు అప్పగించాలని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైను సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్‌ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.



## నిలకడగా సోనియాగాంధీ ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జనవరి 8 :** కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్, సీనియర్ నేత సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని సర్ గంగారామ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ గురువారం వెల్లడించారు. సోనియాగాంధీ ఢిల్లీలో గాలికాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం సోమవారం రాత్రి సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె చికిత్సకు స్పందిస్తున్నారని, కోలుకుంటున్నారని అజరు స్వరూప్ ఆమె ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించారు.

# టెలీమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యం

- నిధులు దారిమళ్లినా ప్రభుత్వం చోద్యం
- కేఆర్‌ఎమ్‌బీ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 8 :** నదీ జలాల వినియోగంలో లెక్కలు తేల్చే టెలిమెట్రీల ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కృష్ణా జలాల వినియోగ లెక్కలు తేల్చేందుకు టెలిమెట్రీల కోసం కేటాయించిన రూ.4.18 కోట్ల నిధులను కేఆర్‌ఎమ్‌బీ దారి మళ్లిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూడటం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేస్తూ.. కృష్ణా జలాలను ఏపీ అక్రమ వినియోగానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్, 2016లో జరిగిన కేఆర్‌ఎమ్‌బీ సమావేశ నిర్ణయం ప్రకారం తొలి దశలో 18 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయగా.. రెండో దశలో 9 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని.. అవి ఇప్పటివరకూ అమలు చేయకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. టెలిమెట్రీ ఏర్పాటు కోసం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదు?.. ఎందుకు ఏపీ మీద ఒత్తిడి చేయకుండా మౌనంగా ఉన్నట్లు? అంటూ రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడాల్సిన ఐఖీఓః.. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ, కేంద్రంలోని బీజేపీ.. మూడు కలిసి టెలీమెట్రిల ఏర్పాటును నిర్లక్ష్యం చేస్తూ తమ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తున్నామని ప్రచారం చేసుకోవడమే తప్ప రెండేళ్ల నుంచి కేంద్రం చేసిందేమీ లేదంటూ హరీశ్ రావు ఈ సందర్భంగా పెదవి విరిచారు. సబ్ జ్యూడీస్ అని సాకులు చెప్పే కేంద్రానికి సుప్రీంకోర్టులో కేసు ఉన్నప్పటికీ కేసీఆర్ 18 చోట్ల టెలిమెట్రీలు ఏర్పాటు చేసిన విషయం గుర్తు లేదా? అంటూ సూటిగా ప్రశ్నించారు. పోలవరం– నల్లమల సాగర్ విషయంలో మొద్దు నిద్ర ప్రదర్శించినట్లుగానే, టెలిమెట్రీల ఏర్పాటు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని వ్యాఖ్యానించారు. రూ.4.18 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే రికవరి అయ్యేలా చేసి, టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేవలం లేఖలు రాస్తూ కాలయాపన చేయకుండా.. నిధులు మళ్లించిన కేఆర్‌ఎమ్‌బీపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నామని రేవంత్ సర్కార్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు కీలక సూచన చేశారు.

## జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగుల ఆందోళన

### అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత

**హైదరాబాద్:** అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలంటూ నిరుద్యోగులు రోడ్డెక్కారు. కేంద్ర గ్రంథలయం నుంచి అశోక్‌నగర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అభ్యర్థులను చెదరగొట్టిన పోలీసులు.. కొందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అశోక్‌నగర్‌లో కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించింది.



# కాంగ్రెస్‌కు ఏటీఎంగా సింగరేణి

- సింగరేణిని పరిరక్షించుకోవాలి
- టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్



**గోదావరిఖని, జనవరి 8 :** సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంగా వాడుకుంటూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతుందని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్‌కు సింగరేణి సంస్థను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో 30 వేల మంది యువకులకు తాము ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. అదే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఉద్యోగాల జాడేదని విమర్శించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.19 వేల కోట్లు మాత్రమేనని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రూ.24 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సిన స్థితి వచ్చిందన్నారు. సింగరేణి రక్షించడానికి, కార్మికులకు జీతభత్యాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.48 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు మెడికల్ బోర్డు ప్రతి నెలలో రెండు పర్యాయాలు నిర్వహిస్తామని చెప్పి గడిచిన 10 నెలల్లో ఒక్క బోర్డు కూడా నిర్వహించలేదని దుయ్యబట్టారు. వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన, అశాంతి, గందరగోళంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల కాల పరిమితి ముగిసినందున తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో జరిగే సంప్రదింపులకు అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, చీఫ్ జనరల్ సెక్రటరీ కాపుకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కోశాధికారి చెల్పూరి సతీష్, కేంద్ర ఉపాధ్యక్షుడు మెడికల్ సంపత్ కుమార్, మంగీలాల్, కూసన వీరభద్రం, ప్రభాకర్ రెడ్డి, సదానందం, 11 డివిజన్ల ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, మల్రాజు శ్రీనివాసరావు, మేడిపల్లి సంపత్, బండి రమేష్, బడితల సమ్మయ్య, నాగెల్లి వెంకటేశ్వర్లు, గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాసరావు, జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.



# చైనా మాంజాపై పోలీసుల ఉక్కుపాదం

### పెద్ద ఎత్తున నిల్వలు స్వాధీనం

**హైదరాబాద్, జనవరి 8 :** మనుషులకు, పక్షులకు, పర్యావరణానికి హాని కలిగిస్తున్న చైనా మాంజా పై హైదరాబాద్ పోలీసులు కొరడా జులిపిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్న రూ.1.24 కోట్ల విలువైన నిషేధిత చైనా మాంజాను పట్టుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ గురువారం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకునే సమయంలో కొందరు చర్యల వల్ల ప్రాణాలు హరిస్తున్నాయని అన్నారు. చైనా మాంజాపై నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారని, నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పోలీసులు చేపట్టిన తనిఖీల వల్ల వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఈ–కామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఎ÷–లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేశామని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ సీపీ ఎం. శ్రీనివాసులు, డీసీపీలు కారె కిరణ్ ప్రభాకర్, జి. చంద్రమోహన్, , గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ రావు అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

- 18న ఖమ్మంలో భారీ ర్యాలీకి సన్నాహాలు
- 19, 20, 21 తేదీల్లో జాతీయ కౌన్సిల్ సమావేశం
- సిపిఐ జాతీయ నాయకులు హాజరు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ వెల్లడి



**ఖమ్మం, జనవరి 8 :** సిపిఐ వందేళ్ల ప్రస్థానం పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథా కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడించారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ. ప్రపంచాన్ని బెదిరించాలనే దుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ,ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.

# డాలర్, ఆయిల్‌పై ఆధిపత్య ధోరణి!



**ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మార్పు వస్తోంది. డాలర్ ఆధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. చమురుపై పెత్తనాలను సహించడం లేదు. చైనా యెన్, రష్యా రూబుల్స్, భారత్ రూపాయిల్లో వ్యాపారాలకు సమాయత్తం అవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా వస్తుమార్పిడి పద్దతిలో వ్యాపారాలకు తెరదీస్తున్నారు. ఆయా దేశాలు ఈ రకమైన ఒప్పందాలకు ముందుకు కదులుతున్న వేళ ఇవన్నీ కూడా అగ్రరాజ్యం అమెరికాకు కంటకింపుగా మారాయి. ఇవన్నీ జరిగితే డాలర్ పతనం అవుతుంది. చమురుపై ఆధిపత్యం పోతుంది. అందుకే అమెరికా పావులు కదిపింది. ప్రపంచ దేశాలను గుప్పిట పెట్టుకునే ప్రయత్నంలో భాగంగా వెనుజులాపై దాడికి తెగించింది. ఆ దేశ అధ్యక్షుడు ముదురోను కిడ్నాప్ చేసి బందీగా తీసుకెళ్లింది. అయితే ఈ ఘటనపై వెనిజులాలో ఎక్కడా వ్యతిరేకత రాలేదు. ఎందుకంటే అక్కడ నిరుద్యోగం తాండవిస్తోంది. వలసలు పెరిగాయి.**

ఆయిల్ నిల్వలు ఉన్నా ఎదగడానికి లేకుండ ఆపోయింది. చావెజ్ కాలంలో చమురుశుద్ధి రంగంలోకి దిగిన అమెరిక్ ఆయిల్ కంపెనీలను తన్ని తగలేశారు. ఈ కారణంగా అక్కడ తినడానికే తిండి లేకుండా పోయింది. సంచుల్లో కరెన్సీ పట్టుకెళితు సంచెడు కూరగాయులు కూడా దొరకని పరిస్థితి దాపురించింది. అందుకే అమెరికా దాడిని ప్రజలు స్వాగతించారు. ఇకపోతే వెనెజులాతో చైనా వ్యాపారం జోరుగా సాగుతోంది. చైనా యెన్‌లో వ్యాపారం సాగిస్తోంది. ఇది అమెరికాకు గిట్టడం లేదు. చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెంటనే రంగంలోకి దగడం వెనక ఇదే కారణమని అంతర్జాతీయ పరిణామాలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా ఎదిగిపోతున్న చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెనిజులాను ఎరగా చేసుకుందన్న వాదన ఉంది. అందులో భాగంగానే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై నార్కో టెర్రరిస్టు అనే అభియోగం మోపి అమెరికా కిడ్నాప్ చేసింది. అమెరికా వెనిజులాలో లభించే చమురు, ఖనిజ నిక్షేపాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు మాత్రమే ఈ దురాక్రమణకు పాల్పడలేదు. గత రెండు దశాబ్దాలుగా లాటిన్ అమెరికాపై చైనా పట్టు పెంచుకుంటోంది. లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఆర్థిక సహాయమందిస్తోంది. దక్షిణ అమెరికాపై చైనా పట్టును సడలించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇలాంటి బెదిరింపులకు దిగుతున్నారు. ఆర్థిక కోణంలో పరిశీలిస్తే.. వెనిజులాలో లభించే క్రూడాయిల్ ఎక్కువశాతం చైనాకు ఎగుమతి అవుతుంది. ఇదే కాకుండా బొగ్గు, బంగారం, బాక్సైట్, ఐరన్ ఎగుమతులు కూడా రెండు దశాబ్దాల్లో చైనాకు విపరీతంగా వియత్నాం ఎగుమతుల్ని పెంచుకుంది. 2000 సంవత్సరంలో ఒక శాతం కన్నా తక్కువగా ఉన్న ఖనిజ ఎగుమతులు అధికారిక లెక్కల ప్రకారం 2018 నాటికి 28 శాతం మేర వియత్నాం ఎగుమతులు పెరిగాయి. రెండు దశాబ్దాల కాలంలోనే.. లాటిన్ అమెరికా దేశాలకు చైనా రుణాలు ఇవ్వడం కూడా పెరిగింది. 1990ల మధ్యలో వెనిజులా దిగుమతులలో అమెరికా వాటా చాలా సంవత్సరాలు స్థిరంగా 40 శాతం మార్కును దాటింది. 2023లో వెనిజులా దిగుమతుల్లో అమెరికా వాటా కేవలం నాలుగో వంతు మాత్రమే. అయితే అదే కాలలో చైనా వాటా మూడింట ఒకవంతుగా ఉంది. గత రెండు దశాబ్దాలలో చైనా వాటా పెరిగింది. అమెరికా నుంచి దిగుమతుల వాటా దాదాపు సగానికి తగ్గింది. ఇదే క్రమంలో డాలర్ల నుంచి చైనా యెన్‌ల రూపంలో మారకం సాగుతోంది. వెనిజులాపై ఆంక్షల నేపథ్యంలో ఈ పద్దతిని చైనా ఎంచుకుంది. ఇది కూడా అమెరికా ఆగ్రహానికి కారణమయ్యింది. చైనా 2001-2023 మధ్యకాలంలో లాటిన్ అమెరికా దేశాలకు చైనా నుంచి పెట్టుబడుల పరంగానూ, సహాయంగానూ, రుణాలు, గ్రాంట్ల రూపంలో మొత్తం 300 బిలియన్ డాలర్లకు పైగా అందించింది. అందులో మూడింట ఒకవంతు కంటే ఎక్కువ సుమారు 106 బిలియన్ డాలర్లను వెనిజులాలో చైనా పెట్టుబడి పెట్టింది. లాటిన్ అమెరికాలోనే కాకుండా.. వెనిజులా ప్రపంచవ్యాప్తంగా చైనా నుంచి సహాయం పొందుతున్న నాల్గవ అతిపెద్ద దేశం అని ఎయిడ్ డేటా అనే పరిశోధనా ప్రయోగశాల గణాంకాలు చెబుతున్నాయి. వెనిజులా దిగుమతులతో.. చైనా 170కి పైగా ప్రాజెక్టులను నిర్మించుకుంది. వెనిజులాలో చైనా 26 శాతం కంటే ఎక్కువ విద్యుత్, మైనింగ్ ఇతర సంబంధిత పరిశ్రమల వంటి కీలక రంగాల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈ గణాంకాలు తెలిపాయి. లాటిన్ అమెరికాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి, ఓ రకంగా చైనాకు కౌంటర్ ఇవ్వడానికే వెనిజులా అధ్యక్షుడు మదురోని కిడ్నాప్ చేసినట్లు ఈ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే రష్యా, చైనా, ఇతర ఐరోపా దేశాలు డాలర్ ప్రభావం నుండి బయటపడే ప్రయత్నంలో ఉన్నాయి. ఇవన్‌ఈన గమనించిన ట్రంప త్వరగా చర్య తీసుకోకపోతే మొదటికే ముప్పు వస్తుందని గుర్తించారు. డారల్‌పైనా, ఆయిల్‌పైనా పట్టు కొనసాగించాలంటే అడ్డుకట్ట వేయాలని నిర్ణయించుకున్నారు. దాని పర్యవసానమే వెనిజులాపై దాడి అని గుర్తించాలి. అలాగే చైనా, భారత్, మెక్సికో తదితర దేశాలపైనా ఆంక్షలు, టారిఫ్‌లు విధిస్తున్నారు. బెదిరిస్తున్నారు. ముఖ్యంగా భారత్ ఆధిపత్యానికి గండి కొట్టేందుకు ర కరకాలుగా ప్రయత్నిస్తున్నారు. అక్కడి ఉద్యోగులపైనా ఆంక్షలు విధిస్తున్నారు. ఇవన్నీ కూడ అమెరికా పెత్తనం కొనసాగించేందుకే అని ప్రపంచం గుర్తిస్తోంది.

# ఉపాధి పేరు మార్పుపై ఆందోళనలు

- ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రంలో నిరసనలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



**హైదరాబాద్, జనవరి 8 :** ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉధృతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. నరేగా చట్టం గొప్పతనం వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి కరపత్రం గ్రామాలు, వాడవాడకూ చేరాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీశారని పేర్కొన్నారు. ఈ పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పుకొచ్చారు.జీ రామ్ జీ చట్టంతో పేదల హక్కు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ డీసీసీలు గ్రామసభలు నిర్వహించి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. జీ రామ్ జీ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీసీసీ పదవి బాధ్యతగలదని.. అన్ని కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించాలని మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశర చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేద్దామని సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. వందేమాతరం గీతంతో ఈ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ రామ్ జీ చట్టంపై చర్చించారు. అలాగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం అజెండా రూపొందించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను నిరసిస్తూ తీర్మానం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెనక్కు తీసుకుని.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు.

# మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- చెట్టును ఢీకొన్న విద్యార్థుల కారు
- నలుగురు విద్యార్థుల దుర్మరణం



**రంగారెడ్డి, జనవరి 8 :** రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ ఇక్ఫాయి యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మిర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది.. కారు వేగం ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే యువతిని అత్యవసర చికిత్స ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

# ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

## సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్

**పూనె, జనవరి 8 :** ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్దార్థ్ గాడ్గిల్ గురువారం వెల్లడించారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. ఙూగా, ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలామందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.

# రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

## మరోమారు రేంవత్‌పై కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, జనవరి 8 :** కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో శేరిలింగపల్లి నియోకవర్గానికి చెందిన పలువురు నాయకులు వివిధ పార్టీల నుంచి వచ్చి బీఆర్‌ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ రేవంత్ సర్కారు నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడి పోయినయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసింద్రని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని కేటీఆర్ చెప్పారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో, ఇవాళ అశోక్‌నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. జాబ్ నోటిఫికేషన్‌లు ఎక్కడ రాహుల్‌గాంధీ అని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సెమ్మీ÷నైల్ లాంటివని, ఈ ఎన్నికల్లో చాకుల్లాంటి కుర్రోళ్లను అభ్యర్థులుగా నిలబెడుతామని, గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

**తిరుమల, జనవరి 8 :** వైకుంఠ ద్వార దర్శనానికి గురువారం ఆఖరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు తరలివచ్చారు. దీంతో ఆలయ మాఢవీధులు భక్తుల గోవిందనామ స్మరణతో మారుమ్రోగిపోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లన్నీ నిండిపోగా శిలాతోరణం వరకు క్యూ లైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న 85,752 మంది తలనీలాలు సమర్పించుకోగా 19,443 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.69 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# బిచ్చగాడి మృతి..

## 4.5 లక్షల నగదు లభ్యం

**తిరువనంతపురం, జనవరి 8 :** కేరళలో ఓ బిచ్చగాడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అయితే అతని వద్ద ఉన్న కంటేనర్‌లో సుమారు నాలుగున్న లక్షల నగదును సీజ్ చేశారు. అలప్పుజాలో ఈ ఘటన జరిగింది. వాస్తవానికి ఆ ప్రాంత ప్రజలకు ఆ యాచకుడు సుపరిచితం. రోజూ అతను ఆ ఏరియాలోనే అడుక్కుంటూ తిరుగుతుంటాడు. అయితే సోమవారం రాత్రి ఆ బిచ్చగాడు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో అతని పేరును అనిల్ కిశోర్‌గా నమోదు చేశారు. చికిత్స అనంతరం అతడు ఎవరికీ చెప్పకుండా అక్కడినుంచి వెళ్లిపోయాడు. తన పేరు అనిల్ కిశోర్ అని ఆస్పత్రి అధికారులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం ఆ యాచకుడి మృతదేహం ఓ దుకాణం ముందు ఉండటాన్ని మున్సిపల్ అధికారులు గుర్తించి పోస్ట్‌మార్టం కోసం ఆ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. యాచకుడి మృతదేహం సమీపంలో ఓ ప్లాస్టిక్ డబ్బా దొరికింది. తనిఖీ కోసం దాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అది తెరిచి చూసిన అక్కడి అధికారులు ఒక్కసారిగా షాక్‌కి గురయ్యారు. దానినిండా డబ్బు ఉందని, అది రూ. 4.5 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. స్థానిక పంచాయతీ సభ్యుడు ఫిలిప్ ఉమ్మన్ సమక్షంలో ఆ బిచ్చగాడి కంటేనర్‌ను ఓపెన్ చేశారు. దాంట్లో నగదును గుర్తించారు. ఆ మొత్తం విలువ సుమారు 4.5 లక్షలు ఉన్నట్లు తేల్చారు. సీజ్ చేసిన నగదులో రద్దు అయిన రెండు వేల రూపాయల నోట్లు ఉన్నాయి. ఇంకా విదేశీ కరెన్సీ కూడా ఉన్నది. ప్లాస్టిక్ టిన్నుల్లో నగదును స్టోర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తిండి కోసం కిశోర్ డబ్బులు యాచించేవాడు అని స్థానికులు చెప్పారు.



# ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ దూకుడు

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణ

**హైదరాబాద్, జనవరి 8 :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా.. ఒక కేసులో భార్యాభర్త ల మధ్య తలెత్తిన సమస్యపై తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం.అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసు ల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచా రణకు హాజరు కానున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కొండ ల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షిగా పిలిచినట్లు తెలుస్తోంది.



# జనగణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వరకు గణన పక్రియ

**న్యూఢిల్లీ, జనవరి 8 :** దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన పక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ పక్రియ ముగియనుంది. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం 30 రోజులపాటు ఈ పక్రియను నిర్వహించనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021లో ఈ జనగణన పక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా.. ఈ పక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన పక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ పక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది అంటే.. 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది. ఈ జనగణనతోపాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన పక్రియను చేపట్టి.. పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.



## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డిని
# సన్మానించిన ఎంపీ చామల

**ఆత్మకూరు (ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ దగ్గర ఆత్మకూర్ (ఎం) మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి.ని సన్మానించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. ఆత్మకూర్ (ఎం) మండలం వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన సర్పంచుల అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న పార్టీలకు అతీతంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మరెడ్డి,మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేంద్ర గుప్తా, ఓ బి సి మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య, సింగల్ విండో డైరెక్టర్ తండా నరసింహ,కట్టెకోల హనుమంతు,పరకాల అంజయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదల ఆత్మ బాంధవుడు మియాపురం శశికాంత్

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హుస్సేన్ అనే వ్యక్తి ఇటీవల తన కూతురు వివాహం జరిపించారు. వివాహం జరగడంతో పూట గడవడం భారమవుతుంది. ఈ విషయం తెలుసుకున్న బీర్కూర్ కాంగ్రెస్ నాయకులు మియాపురం శశికాంత్ ఆయనకు ఆరువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మియాపురం శశికాంత్ మాట్లాడుతూ ఎవరైనా నిరుపేదలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే, తనకు తోచినంత సహాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేష్ పంతులు, వార్డు సభ్యులు కోరిమే రఘు, ప్రశాంత్ యాదవ్, అరిగే భాస్కర్, యువకులు ఆ వారి ప్రవీణ్, అశోక్, బాలకృష్ణ, పృధ్వి ,ప్రశాంత్, విట్టల్, సాయికుమార్ పాల్గొన్నారు.



# 263 డివిజన్‌లో పోటాపోటీ ప్రెస్‌మీట్‌లు
### స్థానిక కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకుల పొలిటికల్ వార్

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** 263 డివిజన్ నుండి విద్యుత్ నగర్ కాలనీ వెలిమెల గ్రామాలను పక్క డివిజన్ ముత్తంగి భారతి నగర్ లో కలపడంతో మొదలైన పొలిటికల్ యుద్ధం, రోజురోజుకు కొనసాగుతూ చిన్నపాటి తుఫాను గా మారి మాటలు యుద్ధం వరకు వచ్చి ఒకరోజు బీఆర్ఎస్ ఒకరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేసి ఒకరిపై ఒకరు రాజకీయ బాంబులు పేల్చు కుంటున్నారు. ఇది గమనిస్తున్న డివిజన్ ప్రజలు ముక్కున వేలేసుకుంటు న్నారు. అభివృద్ధి పేరు మీద రాజకీయ నాయకులు చేస్తున్న అవినీతిని ప్రజలు క్షణ్ణంగా గమనిస్తున్నారు. టిఆర్ఎస్ పార్టీ మాజీ చైర్మన్ లలితా సోమిరెడ్డి హయాం లో రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నా కూడా తగిన నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు సిపి ప్రభాకర్ రెడ్డి లిరిజాల రవీందర్ లు బాహటంగా విమర్శించారు. రాబోయే రోజులలో ఈతెల్లాపూర్ డివిజన్ తో పాటు ఇక్కడ సర్కిల్ ఆఫీస్,వంద మందితో కూడిన ఒక మేయర్ ఆఫీసు కూడా చేయబోతున్నారని, ఈ విషయంలో ఇటీవల జిహెచ్ఎంసి అధికారులు వచ్చి ఈ ఆఫీసు బిల్డింగును పరిశీలించి పోయారని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు కొల్లూరి భరత్, పావని రవీందర్, జిల్లా నాయకులు అరుణ్ గౌడ్, సుధాకర్ రెడ్డి, వాజిద్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యం
### విద్యార్థులతో కలిసి బారి అవగాహన ర్యాలీ.

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి, నేషనల్ యూత్ డే సందర్భంగా సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ సంస్థ,జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు అధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నిర్మూలనపై సూర్యాపేట పట్టణ కేంద్రంలో బారి ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో 3000 మందికి పైగా విద్యార్థులు, యువత,అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా జడ్జి లక్ష్మ శారద,జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్,జిల్లా ఎస్పి నరసింహ కలిసి ప్రారంభించారు.కోర్టు చౌరస్తా నుండి,పూలసెంటర్ మీదుగా ప్రభుత్వ కళాశాల వరకు ర్యాలీ కొనసాగించారు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నిర్మూలన, యువ శక్తి పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు జిల్లా అధికారులు న్యాయవాదులు పోలీస్ అధికారులు పాల్గొన్నారు

## మొక్కల పెంపకం
# యజ్ఞం లాగా చేపట్టాలి

- భవిష్యత్ తరాలకు ఫలాలు అందేలా మొక్కలు పెరగాలి
- మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు వెల్లడి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మొక్కల పెంపకం ఒక యజ్ఞంలో చేపట్టాలని మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. గురువారం స్థానిక పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ఎనిమిదో వార్డులోని ప్రాథమికొన్నత పాఠశాలలో గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యములో ఎనిమిదవ వార్డ్ సభ్యుడు వంగవీటి పవన్ కుమార్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం ఎనిమిదవ వార్డులో ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్వో మాట్లాడుతూ, విద్యార్థులు మొక్కల నాటడంతో కాకుండా వాటిని పెరిగేలా చర్య తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి మొక్క ప్రయోజనాల పై అవగాహన విద్యార్థులకు ఉండాలన్నారు. మీరు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఫలాలు అందేలా చూడాలని ఆయన కోరారు. వచ్చే రెండు నెలల్లో జరగనున్న పరీక్షల్లో అధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నడుస్తున్నాయని ఈ సం,, పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి మంచి గుర్తింపు పొందాలని ఆయన కోరారు.

### వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి : ఎంఈఓ చలపతిరావు

వనజీవి రామయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అబశ్రీశ్రీ ఎంఈఓ చలపతిరావు అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఉద్దేశించి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒకొక్కరు ఒక మొక్క నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని ఆయన కోరారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని మొక్కలు చెట్లు అవుతాయని విద్యార్థుల భవిష్యత్తు కూడా అలానే ఉంటుందని ఆయన అన్నారు. నాటే ప్రతి మొక్క పెరుగుదలకు విద్యార్థులకు కృషి చేయాలని ఆయన కోరారు. వచ్చే పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలను హై స్కూల్ కు తీసుకురావాలని కోరారు

### మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఏపిఎం సురేందర్

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యత అని ఏపీఎం సురేందర్ పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు నాటిన మొక్కలను సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. నాటిన ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతుందని ఆయన అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాట మొక్కల పెరుగుదల వంటి అంశాలు తెలిసి ఉండాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థులు చాలెంజిగా తీసుకొని విద్యతోపాటు మొక్క పెరుగుదలకు కృషి చేయాలని కోరారు.

### మొక్కలు నాటుదాం పర్యావరణ కాపాడుదాం : సర్పంచ్ వెంకటలక్ష్మ

మొక్కలు నాటుదాం పర్యావరణ కాపాడుదాం అని స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మ అన్నారు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నాటిన ప్రతి మొక్కను కాపాడుకునే బాధ్యత మనపై ఉంటుందని అన్నారు. విద్యార్థులు తమ చదువుతోపాటు నాటిన మొక్కలను సంరక్షంచుకోవాలనే బాధ్యత మనందరిపై ఉంటుందని అన్నారు. విద్యార్థులు చదువులో భాగంగానే మొక్కల పెరుగుదలకు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, వార్డు సభ్యులు సింధు, ప్రమీల, భాను, ఈశ్వరి, అన్నపూర్ణ, రాంబాయి, ఎలమంద, కోటేశ్వరరావు, వెంకటమ్మ , రోహిత్, వినోద్ సుప్రజ, హైస్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు గణేష్, గోవిందరెడ్డి, ఆదిశేషు, రవి, గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ప్రతినిధి రవి, సంజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు 'వనస్థలి జాతిరత్న' పురస్కారాలు

- వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు సిహెచ్ వి ఆర్ కె మూర్తి, బి.యన్.రెడ్డి డివిజన్ టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత



**రంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8:** ఈనెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి శ్రీ కన్వెన్షన్ హాల్ రాఘవేంద్ర మఠం పక్కన సచివాలయ నగర్ వనస్థలిపురంలో, వనస్థలి జాతిరత్న పురస్కారా లను, అందజేస్తున్నట్లు వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు, సి హెచ్ వి ఆర్ కె మూర్తి, బి.యన్.రెడ్డి డివిజన్ టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయనేత తెలిపారు. గురువారం నాడు వారు మీడియాతో మాట్లాడుతూ వనస్థలిపురంలోని వివిధ రంగాలలో బహుముఖ ప్రజ్ఞావంతులైన 60 సంవత్సరాల వయసు పైబడిన ప్రజ్ఞ వంతులను కమిటీ ద్వారా నిర్ణయించి వారికి వనస్థలి జాతి రత్న పురస్కారాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాటక రంగం, సినిమా రంగం, టీవీ రంగం, సామాజిక సేవారంగం, వార్తాపత్రిక రంగం, యోగా రంగం, వాస్తు రంగం, ఆధ్యాత్మిక రంగం, సంగీత రంగం మొదలైన అత్యున్నతమైన రంగాలలో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి ఈ పురస్కారం అందజేయడం జరుగుతుంది అన్నారు ఈ పురస్కారం ద్వారా పెద్దలను గౌరవించుకునే సాంప్రదాయానికి వనస్థలిపురం భక్త సమాజం యువ నాయకులు విజయనేత సారధ్యంలో కొత్త ఒరవడిని నూతన తరాలకు అందించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో పెద్దలతో పాటు రేపు సమాజానికి ఉపయోగపడే యువతను ప్రోత్సహించే కార్యక్రమంగా యువకులకు ఆటల పోటీలు పెట్టి వారికి బహుమతి ప్రధానోత్సవం కూడా చేయడం జరుగుతుందని అన్నారు. సమాజాన్ని నడిపించడానికి పెద్దలు సూచనలు పెద్దల అవసరంతో పాటు వారు ఇచ్చిన సూచనలను తూచా తప్పకుండా అమలుపరుస్తూ కార్యక్రమాలు నిర్వహించడానికి విజయవంతం చేయడానికి యువకులు వనస్థలిపురం అభివృద్ధికి తోడ్పడాలని భావిస్తూ యువకులకు బహుమతి ప్రధానం ద్వారా వారిని ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. ఇటు యువకులను అటు పెద్దలను సమతుల్యం చేస్తూ నిర్వహించే ఈ వనస్థలి జాతిరత్న పురస్కారం మహోత్సవానికి కాలనీలో అందరిని సవినవేయంగా వార్తాపత్రికల ద్వారా ఆహ్వానించడం జరుగుతుందని దీనికి అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

# బంజారాల సమస్యలపై రథయాత్రకు మద్దతు
### నంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు శ్రీనివాస నాయక్

**రంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8:** బంజారాల సమస్యలపై దేశవ్యాప్తంగా బంజారాల ఐక్యత సమస్యల పరిష్కారానికి త్వరలో కేరళా కర్ణాటక నుంచి జమ్మూ కాశ్మీర్ వరకు వివిధ రాష్ట్రాలలో బంజారా భారత్ ప్రచార యాత్ర చేపట్టేందుకు బంజారా భారత్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మాజీ ఎంపీ రవీందర్ నాయక్ చేస్తున్న కార్యక్రమానికి నంగారా బేరి లంబాడి హక్కుల జాతీయ అధ్యక్షులు, పుట్టంగండి ముడావత్ శ్రీనివాస్ నాయక్ మద్దతు తెలిపారు. ఎంతోమంది బంజారాలు, లంబాడీలు, అడవిని భూమిని నమ్ముకుని బతుకులు ఈడుస్తున్నారని, 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బంజారా గిరిజనుల గుర్తింపు స్వర్ణోత్సవ కార్యక్రమం ముగింపు సంబరాలు నూతనంగా ఎన్నికైన బంజారా సర్పంచుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చేపట్టిన రథయాత్రకు తమ సంపూర్ణ మద్దతు అందజేస్తున్నామని అన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడేలా ఉందన్నారు. ఉద్యోగులకు కావాల్సిన ముఖ్యమైన తేదీలను ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూక్యా పాండు నాయక్, అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేందర్, కోశాధికారి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ స్వప్న, ఆర్గనైజర్ సెక్రటరీ



యాదగిరి, ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ రాంబాబు, పద్మావతి, కల్చరల్ అండ్ స్పోర్ట్స్ సెక్రెటరీ మల్సూర్, సభ్యులు ఉమామహేశ్వర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ
### : జీహెచ్ఎంసీ

**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఝా) పథకం 2025ఉ26ను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 90 శాతం మాఫీ లభించనుంది. ఈ పథకం ప్రకారం, పన్ను చెల్లింపుదారులు పూర్తి ప్రిన్సిపల్ ట్యాక్స్‌తో పాటు కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే ఒక్కసారి చెల్లిస్తే, మిగిలిన 90 శాతం వడ్డీ పూర్తిగా మాఫీ చేయబడుతుంది.



# ఇంద్రానగర్ కాలనీలో ప్రజాసేవ చేస్తున్న కూరెల్ల అనిల్

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండల కేంద్రంలో 12వ వార్డులో ప్రజాసేవ ఆత్మకూర్ ఇంద్రనగర్ కాలనీలో 12వ వార్డు మెంబర్ కూరెళ్ళ అనిల్ మరోసారి ప్రజాసేవ గొప్పధనని చాటుకున్నాడు రోడ్డు మీద ఉన్న బోర్ వాటర్ వృధాగా వెళుతున్న దాన్ని మాన్యువల్ లోకి మళ్ళించడం ప్రజలకు ఇబ్బంది కలగకుండా మరియు రోడ్ ధ్వంసం కాకుండా మరమ్మతులు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా.గ్రామ శాఖ ఉపాధ్యక్షులు. ఉగ్గే నరేష్. గట్టు శేఖర్ బద్దుల వెంకన్న కొంగరి విద్యాసాగర్ వేముల అశోక్ గట్టు విజయ్ బొడ్డు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



# సర్వేపల్లి లో నర్సరీ ప్రారంభించిన సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి

**ఆత్మకూర్ (ఎం).రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని సర్వేపల్లి గ్రామంలో ఈరోజు స్థానిక సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి నర్సరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నర్సరీ లో మొక్కలు పెంచి గ్రామం చుట్టూ మొక్కలు నాటి పెంచడం వలన ఆక్సిజన్ తో పాటు వర్షాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజ నరేష్, జిపిఓ సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ దంతూరి శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ పొనగానీ అండాలు, వార్డ్ మెంబర్ మచ్చ రాజు, ముక్కాముల నర్సయ్య, మచ్చ రామచందర్, బద్దుల జాంగిర్, ఇంజామూరి సంధ్య,మచ్చ మంజుల, కల్వకుంట్ల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# 135 గురించి ట్రీట్మేంట్ చేసిన దంతవైద్యుడు డాక్టర్ ఉజ్వాల్ రెడ్డి గుమ్మి

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం సిద్దాపురం రోడ్డు సత్యనారాయణ రెడ్డి ఫాం హౌస్ లో గత నాల్గు రోజులుగా జరిగిన దంత వైద్య శిబిరంలో డాక్టర్ ఉజ్వల రెడ్డి గుమ్మి 135 మందికి పరీక్షలు జరిపి ట్రీట్మెంట్ ఇచ్చినారు. వారికి మరియు ఎన్నారై గుమ్మి దయానంద రెడ్డి కి ఇండియన్ రెడ్ క్రాస్ మండల అధ్యక్షులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు శాలువలతో సత్కరించి వీడ్కోలు పలికారు వారి సేవకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు జెట్ట యాదగిరి సత్యనారాయణ ఏనుగు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



# గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టిన సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ని ముద్దాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామంలో ఉన్న చెత్త గ్రామ సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందితో గురువారం గ్రామంలోనీ పలు కాలనీలలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు చెత్తను గ్రామపంచాయతీకి సంబంధించిన వాహనంలో వేయాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలు గ్రామ పరిశుభ్రత లో భాగంగా నూతన పాలకవర్గానికి ప్రజలు సహకరించాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే గ్రామం అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బడక శ్రీనివాస్, సెక్రెటరీ లాలయ్య ,గూడూరు సునీతమ్మ యాదిరెడ్డి ,వాకిటి మంజుల , మచ్చేందర్ రెడ్డి, శ్యామల చైతన్య నాగిరెడ్డి, సోలిపురం బుచ్చిరెడ్డి, సామ రాజేందర్ రెడ్డి, బత్తుల విక్రమ్, వాకిటి కొండల్ రెడ్డి, నర్సిరెడ్డి , గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# భారీగా కొకైన్ రవాణా..

## అమెరికాలో భారతీయులు అరెస్ట్..

అమెరికాలో పెద్దఎత్తున మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఇండియానా రాష్ట్రంలో కొకైన్‌ను తరలిస్తున్న ఇద్దరు భారతీయ డ్రైవర్లను అక్కడి అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈనెల 4న ఇండియానాలో చిన్న ట్రక్కుల్లో కొకైన్ తరలించడాన్ని స్థానిక అధికారులు అడ్డుకున్నారని డీహెచ్ఎస్ తెలిపింది. సాధారణ తనిఖీల్లో భాగంగా ట్రక్కుల్లోని స్లీపర్ బెర్త్‌ల నుంచి 309 పౌండ్ల (దాదాపు 140 కిలోలు) కొకైన్‌ను కనుగొన్నట్లు వివరించింది. నిందితులు భారత్‌కు చెందిన గుర్‌ప్రీత్ సింగ్ (25), జస్వీర్ సింగ్ (30)గా గుర్తించినట్లు వెల్లడించింది. దీన్ని అడ్డుకోకపోయుంటే అనేకమంది అమెరికన్ల ప్రాణాలకు ముప్పు కలిగిఉండేదని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితులు కాలిఫోర్నియా నుంచి వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందారని పేర్కొంది. గుర్‌ప్రీత్ 2023లో యూఎస్‌లోకి అక్రమంగా ప్రవేశించినట్లు గుర్తించామని వెల్లడించింది. తాను భారతీయుడినని, అక్రమంగా యూఎస్‌లో ఉంటున్నానని గుర్‌ప్రీత్ అంగీకరించినట్లు తెలిపింది. ఇక, జస్వీర్ సింగ్ కూడా 2017లో అక్రమంగానే యూఎస్‌కు వచ్చినట్లు గుర్తించామని పేర్కొంది.



# అమెరికా పడవలను ముంచేయాల్సి వస్తుంది జాగ్రత్త

## రష్యా వార్నింగ్

**రష్యా :** రష్యా జెండాతో ఉన్న వెనెజువెలా చమురు నౌకను అమెరికా సీజ్ చేయడంతో ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై ఇప్పటికే పుతిన్ సర్కారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తాజాగా రష్యా చట్టసభ్యుడొకరు దీనిపై మాట్లాడుతూ.. అగ్రరాజ్యానికి గట్టి హెచ్చరికలు చేశారు. అవసరమైతే అమెరికా పడవలను ముంచేస్తామని హెచ్చరించారు. “ఏం చేసినా మాకు శిక్ష పడదు అన్న అతివిశ్వాసంతో అగ్రరాజ్యం ప్రవర్తిస్తోంది. ప్రతీకార చర్యలతో అమెరికాను అడ్డుకోవాలి. అంతర్జాతీయ చట్టాలను ఇలాగే ఉల్లంఘిస్తే మిలిటరీ దాడులను ఎదుర్కోడానికి ఆ దేశం సిద్ధంగా ఉండాలి. అవసరమైతే టార్పిడోలతో దాడులు చేయడం, అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయడం వంటివి చేయాల్సి వస్తుంది” అని రష్యా చట్టసభ్యుడు అలెక్సీ జురావ్లెవ్ అన్నారు.

### నౌక సీజ్.. వీడియో విడుదల

ఇదిలాఉండగా.. ఈ నౌక స్వాధీనానికి సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్‌గార్డ్ విడుదల చేసింది. అమెరికా రక్షణశాఖ, తీర రక్షక దళం సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రష్యా నౌక మ్యారినెరా (పాత పేరు బెల్లా-1)ను సీజ్ చేసినట్లు అందులో పేర్కొంది. అమెరికా భద్రత, అంతర్జాతీయ చట్టాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాసుకొచ్చింది. ఐస్‌లాండ్ దక్షిణ తీరానికి 190 మైళ్ల దూరంలో ఈ నౌకను స్వాధీనం చేసుకున్నారు. హెలికాప్టర్ నుంచి అమెరికా మెరీన్లు (సైనిక సిబ్బంది) నౌక పైకి దిగి.. అందులోని సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహకరించడం గమనార్హం. అమెరికా ఈ దాడి చేసే సమయానికి రష్యా దళం అక్కడికి సమీపంలోనే ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు ఏ దేశపు జెండా లేని మరో నౌక సోఫియాను కూడా అమెరికా దళాలు సీజ్ చేశాయి.



# బంగ్లాదేశ్‌లో మరో రాజకీయ నేత హత్య..

**ఢాకా :** మరికొన్ని రోజుల్లో ఎన్నికల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మరో రాజకీయ నేతపై కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి చెందిన అజీజుర్ ముసబ్బిర్ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజుర్ గతంలో బీఎన్‌పీకి చెందిన ఢాకా మెట్రోపాలిటన్ నార్త్ స్వచ్ఛసేవక్ దళ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేశాడు. ఢాకాలోని కర్వాన్ బజార్ వద్ద ఓ హోటల్ సమీపంలో ఈ ఘటన జరిగింది. దుండగులు అతిదగ్గర నుంచి అజీజుర్‌పై కాల్పులు జరిపి పారిపోయారు. బాధితుడు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో మరో వ్యక్తికి గాయాలవగా.. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు జరగలేదు. తాజా కాల్పుల ఘటనతో దేశంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అజీజుర్‌పై కాల్పులను వ్యతిరేకిస్తూ అనేక మంది బీఎన్‌పీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. భద్రతాధికారులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నాలు చేశారు.

# భారత్‌పై 500 శాతం టారిఫ్‌లు!

## కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్..

**యూఎస్ :** ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒకవేళ ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధించేందుకు ట్రంప్‌నకు అధికారం లభిస్తుంది. ఈ బిల్లుకు సంబంధించి రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టు చర్చనీయాంశమైంది. ట్రంప్‌తో భేటీ అయ్యి పలు కీలక అంశాలపై చర్చలు జరిపినట్లు గ్రాహమ్ తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు అధ్యక్షుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనున్నట్లు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తోన్న రక్తపాతానికి భారత్, చైనా, బ్రెజిల్ పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయ ని గ్రాహమ్ ఆరోపించారు. ఇకపై ఆ దేశాలు మాస్కో చమురు కొనుగోలు చేయకుండా ఈ బిల్లు అడ్డుకుంటుందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత రష్యాపై విధించిన ఆంక్షలను ఉల్లంఘించే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు వేసే అధికారం యూఎస్‌కు లభిస్తుందన్నారు. ఈ బిల్లుపై త్వరితగతిన ముందుకుసాగుతామని తెలిపారు. యుద్ధం ఆపేందుకు సిద్ధమంటూ పుతిన్ మాటలు చెబుతూనే అమాయకులను చంపుతున్నారని గ్రాహమ్ మండిపడ్డారు. రష్యా చమురు కొనుగోలుదారుల్లో



చైనా మొదటి స్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ చమురు కొనుగోళ్లపై ట్రంప్ మొదటినుంచి ఆగ్రహంతో ఉన్నారు. ఈ కారణంతోనే గతేడాది భారత దిగుమతులపై ట్రంప్ అదనపు సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరాయి. మరోవైపు.. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్- అమెరికా మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

### భారత్‌తో యుద్ధం తర్వాత హాట్ కేకుల్లా

# మా జెట్స్ విక్రయాలు

## పాక్ రక్షణ మంత్రి

**పాకిస్థాన్ :** ప్రగల్భాలు పలకడం, నవ్వులపాలవడం పాకిస్థాన్‌కు కొత్తేంకాదు. అయినా సరే తీరు మార్చుకోని అక్కడి నేతలు మళ్లీమళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. తాజాగా దాయాది రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధం తర్వాత తమ యుద్ధ విమానాలకు ఎక్కడ లేని గిరాకీ వచ్చిందని, అవి హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయన్నారు. ఇకపై తమ ఆర్థిక కష్టాలు తీర్చేందుకు ఐఎంఎఫ్ రుణం కూడా అవసరం ఉండకపోవచ్చని పగటి కలలు కంటున్నారు. “గతేడాది మే నెలలో భారత్‌తో నాలుగు రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత పాకిస్థాన్‌కు రక్షణ ఆర్డర్లు పెరిగాయి. అవి ఏ స్థాయిలో అంటే.. ఆరు నెలల తర్వాత మాకు అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాల అవసరం ఉండకపోవచ్చు. పాక్ మిలిటరీ సామర్థ్యాలు ప్రపంచం దృష్టిలో పడ్డాయి” అని ఖవాజా వ్యాఖ్యలు చేశారు. ఖవాజా మాటలకు, పాక్ ప్రభుత్వ చర్యలకు ఏమాత్రం పొంతన లేదు. కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఐఎంఎఫ్ నుంచి కొన్నేళ్లుగా పాకిస్థాన్ నిధులు అర్థిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నిధులు పొందేందుకు గాను ఐఎంఎఫ్ సూచించిన సంస్కరణల్లో భాగంగా పాక్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థను అమ్మేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమైంది. ఇక, 2026-2027 బడ్జెట్‌లో కొన్ని సడలింపులు, సబ్సిడీలు ఇవ్వాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకోసం రుణషరతులపై మినహాయింపులు ఇవ్వాలని ఐఎంఎఫ్‌ను కోరు



తోందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఖవాజా చెప్పినట్టుగా పాకిస్థాన్ యుద్ధవిమానాలు జేఎఫ్-17, జే-10కు దొరికిన బయ్యర్లు అజర్‌బైజాన్, లిబియాలు మాత్రమే. బంగ్లాదేశ్ ఇంకా చర్చలు జరుపుతోంది. అయితే, జేఎఫ్-17కు రష్యా, చైనా, ఇటలీ, తుర్కియే, యూకేకు చెందిన పరికరాలను దాయాది అమర్చుతోంది. ఇంజిన్ రష్యాది కాగా.. దాని డిజైనర్, తయారీదారు చైనా. అందులో పాక్ తయారీ పరికరాలు పరిమితంగానే వాడుతున్నారు. దాంతో వాటి అమ్మకాల నుంచి వచ్చే ఆదాయంలో తమ వాటాను ఇతర దేశాలు తీసుకోగా.. షరీఫ్ ప్రభుత్వానికి వచ్చేది అంతంతమాత్రంగానే ఉంటుందని పాక్ రాజకీయ విశ్లేషకులు వెల్లడించారు. ఒకవేళ జేఎఫ్-17ను 15 మిలియన్ డాలర్లు, జే-10ను 40 మిలియన్ డాలర్లకు విక్రయించినా.. 2026 ప్రారంభం వరకు ఉన్న 300 బిలియన్ డాలర్ల అప్పులకుప్పను తొలగించుకోగలదా..? అని ప్రశ్నిస్తున్నారు.

### వీధిలో ప్రతి కుక్కను తరలించమని

# మేము చెప్పలేదు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** వీధిలో ఉన్న ప్రతి కుక్కను తరలించాలని తాము చెప్పలేదని గతంలో ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని పేర్కొంది. వీధి కుక్కల అంశంపై గురువారం కూడా విచారణ జరిగిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. జంతువుల జనన నియంత్రణకు సంబంధించిన నిబంధనలపై ప్రధానంగా దృష్టిపెట్టాలని సుప్రీం ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. సున్నితమైన ప్రదేశాలలో భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన న్యాయస్థానం.. ఆసుపత్రి వార్డుల్లో, రోగుల చుట్టూ కుక్కలు సంచరించడానికి అనుమతించాలా అని ప్రశ్నించింది. దేశంలో కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించ కుండా



చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని తెలిపింది.

# పోయిన ఫోన్ కోసం టెకీ ట్రాక్..

**ముంబయి :** ఫోన్ పోయిందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఓ టెకీ సొంతంగానే దానిని ట్రాక్ చేసుకున్నారు. తన ఫోన్‌తో పాటు దొంగతనానికి గురైన మరికొన్నింటిని గుర్తించేలా చాకచక్యంగా వ్యవహరించారు. ఈ దెబ్బకు విధుల్లో అలసత్వం వహించిన అధికారి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ముంబయి లోని ఘాట్‌కోపర్ ప్రాంతానికి చెందిన అంకితా గుప్తా గత వారం తన కుటుంబంతో కలిసి వారణాసికి వెళ్లారు. అసీఘాట్ వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎవరో ఆమె ఫోన్ కొట్టేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయితే పోలీసుల నుంచి తక్షణ స్పందన లేకపోవడంతో.. ఆమె తన స్నేహితుల సహాయంతో ఆ ఫోన్ లొకేషన్‌ను గుర్తించారు. మండుఆదీహ్‌లోని ఒక ఇంట్లో ఫోన్ ఉన్నట్లు ట్రాకింగ్ ద్వారా వెల్లడైంది. ఆ తర్వాత ఆమె పోలీసుల్ని అప్రమత్తం చేశారు. వారు ఆ ఇంటిలో తనిఖీలు చేపట్టి.. టెకీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా దొంగతనానికి గురైన మరో 12 ఫోన్లను ఆ సోదాల్లో గుర్తించడం గమనార్హం. ఈ పరిణామం తర్వాత పోలీసు డిప్యూటీ కమిషనర్ అంతర్గత విచారణకు ఆదేశించారు. అసీఘాట్ పోలీసు అవుట్‌పోస్ట్ ఇన్‌ఛార్జి విధుల్లో నిర్లక్ష్యం వహించారని విచారణలో తేలింది. దాంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

# పాక్ జాతీయతను దాచి ప్రభుత్వ ఉద్యోగం..

## మహిళపై కేసు

**లఖ్‌నవూ:** పాకిస్థాన్ జాతీయతను దాచి ప్రభుత్వ ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయురాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపుర్‌కు చెందిన మాహిరా అక్తర్ ఎలియాస్ ఫర్జానా అనే మహిళ 1979లో ఓ పాకిస్థానీ వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అనంతరం ఆమెకు ఆ దేశ పౌరసత్వం లభించింది. కొన్నేళ్లకు విడాకులు కావడంతో.. ఇద్దరు పిల్లలతో కలిసి పాకిస్థాన్ వీసాపై భారత్‌కు చేరుకుంది. స్థానికంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకుంది. అదే సమయంలో తనను తాను భారతీయురాలిగా చెప్పుకొంటూ.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. రాంపుర్ జిల్లా కుమ్హరియా గ్రామంలో విధులు నిర్వహించింది. అయితే, విద్యాశాఖ అధికారులు నిర్వహించిన అంతర్గత విచారణలో ఆమె పాకిస్థానీ జాతీయురాలిగా తేలింది. నకిలీ పత్రాలతో ఉద్యోగం సాధించినట్లు గుర్తించింది. తొలుత ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. అనంతరం విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రభుత్వ ఉద్యోగమంటూ

# నకిలీ జాయినింగ్ లెటర్లు

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలంటూ మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపి నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠా కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా ఆరు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గురువారం పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించింది. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక డొమైన్లను పోలిన నకిలీ మెయిల్స్ నుంచి మోసపూరిత ఆఫర్ లెటర్లను అభ్యర్థులకు పంపింది. ఈ స్కామ్‌లో భాగంగా ఆర్పీఎఫ్, రైల్వే టీటీఈ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు పొందారంటూ కొంతమందికి 2, 3 నెలల జీతాలు కూడా చెల్లించింది. దాంతో కొత్త అభ్యర్థులను మభ్యపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. మొదట రైల్వే విభాగంలో ఈ కుంభకోణం బయటపడటంతో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత తీగ లాగితే.. దాదాపు 40కి పైగా ప్రభుత్వ విభాగాల పేర్లను ఈ ముఠా దుర్వినియోగం చేసినట్లు తేలింది. వీటిలో ఆదాయపు పన్ను విభాగం, పోస్టాఫీసు..వంటి ప్రభుత్వ విభాగాలు ఉండటం గమనార్హం.

# మమతా బెనర్జీ కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారు

## ఈడీ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** కోల్‌కతాలోని ఐ-ప్యాక్ సంస్థపై దాడులు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో దాడులు చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ ఇంట్లోకి ప్రవేశించారని.. ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు దస్త్రాలను సహా కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని పేర్కొంది. సీఎం సహా ఆమె సహాయకులు, పోలీసులు వాటిని బలవంతంగా తీసుకెళ్లారని వెల్లడించింది. బొగ్గు అక్రమ రవాణా ద్వారా ఆదాయం పొందిన వ్యక్తులకు సంబంధించి కోల్‌కతాలో ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ వెల్లడించింది. హవాలా మనీతో ఐప్యాక్‌కు సంబంధం ఉందని, ఇందులో ఓ వ్యక్తికి ఈ సంస్థకు మధ్య రూ.కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని పేర్కొంది. భారీసంఖ్యలో పోలీసు అధికారులతో ముఖ్యమంత్రి ఐప్యాక్ డైరెక్టర్ నివాసానికి వచ్చారని, అంతకుముందు వరకు సోదాలు శాంతియుతంగా, అధికారికంగా జరిగాయని ఈడీ పేర్కొంది. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఈ సోదాలు జరిగాయని, ఏ రాజకీయ పార్టీ, ఏ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని వీటిని చేపట్టలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పష్టం చేసింది. సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలను చోరీ చేశారని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై ప్రతీక్ జైన్ తరఫున ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నామని, వాటిలో వెల్లడైన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని షేక్స్‌పియర్ సరాని పోలీసులు వెల్లడించారు. ఇదిలాఉంటే, తృణమూల్ కాంగ్రెస్‌కు రాజకీయ కన్సల్టెన్సీగా ఉన్న ఐప్యాక్.. ఆ పార్టీకి ఐటీ, మీడియా కార్యకలాపాలనూ నిర్వహిస్తోంది.





# కొలంబియాపై మారిన ట్రంప్ స్వరం

## గుస్తావోతో భేటీకి సిద్ధమని ప్రకటన

**యూఎస్ :** వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత లాటిన్ అమెరికాలోని మెక్సికో, క్యూబా, కొలంబియాలను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయంలో ట్రంప్ తాజాగా తన స్వరాన్ని మార్చారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. గుస్తావోతో స్నేహపూర్వకమైన ఫోన్ సంభాషణ జరిగిందని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మాదక ద్రవ్యాలు, ఇతర విభేదాల గురించి తాము చర్చించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా త్వరలోనే గుస్తావోతో భేటీ కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. ఇక, మదురో నిర్బంధం తర్వాత మెక్సికో, క్యూబా, కొలంబియా సైతం మాదక ద్రవ్యాలు తయారుచేసి అమెరికాకు తరలిస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే వెనెజువెలా లాంటి పరిస్థితినే వీరు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. ఈ హెచ్చరికలపై గుస్తావో కూడా తీవ్రంగా స్పందించారు. ‘నన్ను తీసుకెళ్లండి. ఇక్కడే మీకోసం ఎదురుచూస్తున్నా’ అంటూ సవాల్ విసిరారు. తమ దేశంపై యూఎస్ సైనిక చర్య చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

# కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

**కువైట్ :** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్ లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. దేశంలో మాదక




ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథంఫెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వీటికి సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా.. దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

# ఎనిమిదేళ్ల తర్వాత ఎయిరిండియా చేతికి డ్రీమ్‌లైనర్



టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కొనుగోళ్లు జరిపిన విమానాలు ఒక్కొక్కొటిగా అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా బోయింగ్‌కు చెందిన 787-9 విమానం సంస్థ చెంతకు చేరింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత డ్రీమ్‌లైనర్ విమానం ఎయిరిండియా ఫ్లీట్‌లో చేరడం గమనార్హం. ప్రైవేటీకరణ తర్వాత ఇదే తొలి డ్రీమ్‌లైనర్ కావడం విశేషం. జనవరి 7న సియాటెల్‌లోని తన ప్లాంట్ నుంచి బోయింగ్ ఈ విమానాన్ని డెలివరీ చేయగా... ఎయిరిండియా అందుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తనిఖీల అనంతరం ప్రయాణానికి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు 2017 అక్టోబర్‌లో చివరి డ్రీమ్‌లైనర్ ఎయిరిండియాలో చేరింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మరో డ్రీమ్‌లైనర్ కంపెనీకి చేరింది. సంస్థ అవసరాలకు అనుగుణంగా ఈ డ్రీమ్‌లైనర్‌ను బోయింగ్ రూపొందించింది. దీంట్లో ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ తరగతులు ఉండనున్నాయి. ఎయిరిండియాను కొనుగోలు చేసిన తర్వాత 2023లో 350 ఎయిర్‌బస్, 220 బోయింగ్ విమానాలకు టాటా గ్రూప్ ఆర్డర్ పెట్టిన సంగతి తెలిసిందే. అందులో 51 నారో బాడీ విమానాలు డెలివరీ కాగా.. తొలి వైడ్ బాడీ విమానం డెలివరీ అయ్యింది. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 300 విమానాలున్నా యి. 185 ఎయిరిండియా నడుపుతుండగా.. మిగిలినవి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తోంది. మరికొన్ని డ్రీమ్‌లైనర్లు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి రానున్నట్లు ఎయిరిండియా వర్గాలు చెబుతున్నాయి.






# 8లక్షల కోట్లు ఆవిరి

## భారీ నష్టాల్లో సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్యంపై సందిగ్ధత నెలకొన్న వేళ.. సూచీలు భారీ ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రష్యాను కట్టడి చేసేందుకు భారత్ వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు, భౌగోళిక ఉద్రిక్తతల వంటివీ ఆజ్యం పోశాయి. దీంతో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 26వేల దిగువన ముగిసింది. దీంతో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు దిగొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 84,778.02 (క్రితం ముగింపు 84,961.14) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,110.10 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.90 పాయింట్ల నష్టంతో 25,876.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 60.35 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం 4,426.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




# మద్యం మత్తులో గొడవ..

## హ్యారీ బ్రూక్‌పై చేయిచేసుకున్న బౌన్సర్

ఇంగ్లాండ్ వన్డే, టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్ మద్యం మత్తులో ఓ నైట్‌క్లబ్ వద్ద గొడవకు దిగాడు. దీంతో బ్రూక్‌పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. గతేడాది నవంబర్ 1న న్యూజిలాం డ్‌తో మూడో వన్డేకు ముందు రోజు ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి హ్యారీ బ్రూక్ తన సహచర క్రికెటర్లు జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్‌తో కలిసి వెల్లింగ్‌ట న్‌లో ఓ నైట్ క్లబ్‌కు వెళ్లాడు. మద్యం తాగి ఉన్నాడని అనుమానించి బ్రూక్‌ను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం జరగ్గా.. ఇంగ్లాండ్ కెప్టెన్‌పై బౌన్సర్ చేయిచేసుకు న్నాడు. ఈ వివాదంపై హ్యారీ బ్రూక్ స్వయంగా టీమ్ మేనేజ్‌మెంట్‌కు వివరణ ఇచ్చాడని సమాచారం. ఘటనపై విచారణ చేపట్టిన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు బ్రూక్‌కు 'ఫైనల్ వార్నింగ్ణ ఇచ్చి దాదాపు 30,000 పౌండ్లు జరిమానా గా విధించింది. బ్రూక్ తన ప్రవర్తనకు క్షమాపణలు చెప్పాడు. 'నా చర్యలు తప్పు అని నేను పూర్తిగా అంగీకరిస్తు న్నాను. ఇది నాకు, మా జట్టుకు ఇబ్బంది కలిగించింది,. ఇంగ్లాండ్‌కు ప్రాతి నిధ్యం వహించడం గొప్ప గౌర వం. జరిగిన దాన్ని నేను తీవ్రంగా పరిగణి స్తాను. సహచరులు, కోచ్‌లు, మద్దతుదారులను నిరాశపరిచినందుకు నేను తీవ్రంగా చింతిస్తున్నాను' అని ఒక ప్రకటన విడుదల చేశాడు. యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లిన ఇంగ్లాండ్ ప్లేయర్లు ఫుల్లుగా మద్యం తాగి ఎంజాయ్ చేసినట్లు వార్తలొ చ్చాయి. రెండో, మూడో టెస్టుకు మధ్య లభించిన 9 రోజుల విరామంలో నోసా బీచ్ రిసార్ట్‌లో మద్యం మత్తులో మునిగితేలారని కథనాలు వచ్చాయి.




# వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌కు అశ్విన్ ఫిదా

కొన్ని రోజులుగా దేశవాళీ, అండర్-19 క్రికెట్లో శతకాల మోత మోగిస్తూ పరుగుల వరద పారిస్తున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పొగడ్తలతో ముంచెత్తాడు. గత 30 రోజుల్లో వైభవ్ చేసిన భారీ స్కోర్లను పేర్కొంటూ ఏంటి తమ్ముడు ఇది అంటూ ఆశ్యర్యం వ్యక్తంచేశాడు. ఐపీఎల్‌లో వైభవ్ వీరబాదుడు చూసేందుకు ఆత్రుతతో ఉన్నట్లు తెలిపాడు. '171(95), 50(26), 190(84), 68(24), 108(61), 46(25), 127(74). గత 30 రోజుల్లో వైభవ్ సూర్యవంశీ దేశవాళీ, అండర్-19 క్రికెట్‌లో సాధించిన స్కోర్లలో ఇవి కొన్ని మాత్రమే. ఏంటి తమ్ముడు? ఈ శాంపిల్ సరిపోతుందా? లేదా మరింత డోస్ పెంచబోతున్నావా? ఈ చిచ్చర పిడుగు 14 ఏళ్ల వయసులో ఎలా విధ్వంసం సృష్టిస్తున్నాడో మీరు మాటల్లో వివరించలేరు' అంటూ అశ్విన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. బుధవారం సౌతాఫ్రికా అండర్-19 జట్టుతో జరిగిన మూడో యూత్ వన్డేలో వైభవ్ (127; 74 బంతుల్లో 10 సిక్స్‌లు, 9 ఫోర్లు) చెలరేగాడు. దీంతో యూత్ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్నవయస్కుడైన అండర్-19 కెప్టెన్‌గా ఘనత సాధించాడు. జనవరి 15 నుంచి ప్రారంభం కానున్న అండర్-19 వరల్డ్ కప్, తర్వాత జరిగే ఐపీఎల్‌లో వైభవ్ ఆటను చూడటానికి ఆత్రుతగా ఉన్నానని అశ్విన్ పేర్కొన్నాడు. 'అండర్-19 వరల్డ్ కప్‌లో అతను చెలరేగుతాడని అంతా భావిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజుశాంసన్ వెళ్లిపోవడంతో వైభవ్ ఐపీఎల్‌లో ఓపెనర్‌గా తొలిసారి పూర్తి సీజన్ ఆడనున్నాడు. రాబోయే నాలుగు నెలల్లో ఈ కుర్రాడి ఆటను చూడటానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను' అని యాష్ వివరించాడు. గతేడాది ఐపీఎల్ సీజన్ ఆఖర్లో అరంగేట్రం చేసిన వైభవ్.. రాజస్థాన్ రాయల్స్ ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై సంచలన రీతిలో 35 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకున్నాడు. ఐపీఎల్ 2026 కోసం ఈ కుర్రాడిని రాజస్థాన్ రూ.1.10 కోట్లకు రిటైన్ చేసుకుంది.

# తిలక్‌వర్మకు శస్త్రచికిత్స



ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు టీమ్‌ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతనికి శస్త్రచికిత్స చేశారు. తిలక్ కోలుకోవడానికి ఇంకా కొన్ని వారాలు పట్టొచ్చు. ఈ క్రమంలోనే జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు ఈ హైదరాబాదీ క్రికెటర్ దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మ్యాచ్‌లు రాజ్‌కోట్‌లో జరుగుతున్నాయి. హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ నాయకత్వం వహిస్తుండగా.. ఇటీవల అతనికి పొట్ట కింది భాగంలో తీవ్రమైన నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. తక్షణమే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దీంతో తిలక్‌కు సర్జరీ చేశారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. దీంతో మూడు, నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. ఫలితంగా కివీస్‌తో టీ20 సిరీస్‌కు ఈ కుర్రాడు అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇప్పటి వరకు మరొకరిని జట్టులోకి తీసుకోలేదు. ఏది ఏమైనా కొంత కాలంగా జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న తిలక్ టీ20 ప్రపంచ కప్ ముందు గాయపడటం టీమ్‌ఇండియాకు భారీ దెబ్బే. ఎందుకంటే అతను వరల్డ్ కప్‌లో ఆడినా ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన 2025 ఆసియా కప్ ఫైనల్‌లో ఈ హైదరాబాదీ బ్యాటర్ అదరగొట్టాడు. 53 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి భారత్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు.

# ఐదో టెస్టులో ఆస్ట్రేలియా విజయం

## యాషెస్ సిరీస్ కైవసం



**సిడ్నీ:** ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-1తో కైవసం చేసుకుంది. సిడ్నీ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 302/8తో ఐదో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ 342 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ జట్టు నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ట్రావిస్ హెడ్ (29), జాక్ వెదర్‌లాండ్ (34), మార్నస్ లబుషేన్ (37) పరుగులు చేయగా.. స్టీవ్ స్మిత్ (12), ఉస్మాన్ ఖవాజా (6) విఫలమయ్యారు. అలెక్స్ కేరీ (16), కామెరూన్ గ్రీన్ (22) నాటౌట్‌గా నిలిచారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ (3/42) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 384, ఆస్ట్రేలియా 567 పరుగులకు ఆలౌటయ్యాయి. 4 మ్యాచ్‌లు ఆడి 26 వికెట్లు పడగొట్టిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. ఈ మ్యాచ్‌తో ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సిడ్నీ టెస్టు తర్వాత తాను రిటైరవనున్నట్లు ఖవాజా మ్యాచ్ ప్రారంభానికి ముందే ప్రకటించాడు.

# హార్దిక్ పాండ్య, జితేశ్ శర్మ మెరుపు హాఫ్ సెంచరీలు

## భారీ స్కోరు చేసిన బరోడా



**రాజ్‌కోట్:** విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా చండీగడ్‌తో బరోడా తలపడుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 49.1 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌటైంది. ప్రియాంష మోలియా (113; 106 బంతుల్లో) సెంచరీతో ఆకట్టుకున్నాడు. హార్దిక్ పాండ్య (75; 31 బంతుల్లో 2 ఫోర్లు, 9 సిక్స్‌లు), జితేశ్ శర్మ (73; 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకాలతో విరుచుకుపడ్డారు. విష్ణు సోలంకి (54; 49 బంతుల్లో) కూడా హాఫ్ సెంచరీతో మెరిశాడు. నినాద్ అశ్విన్ కుమార్ (38), కృనాల్ పాండ్య (20) పరుగులు చేశారు. చండీగడ్ బౌలర్లలో జగ్జిత్ సింగ్ 3, రోహిత్ దండా 2, హర్తేజస్వి కపూర్ 2, నిశుంక్ బిర్లా, విషు కశ్యప్, తరణ్‌ప్రీత్ సింగ్ ఒక్కో వికెట్ సాధించారు.

### కష్టాల్లో మహారాష్ట్ర.. సెంచరీతో ఆదుకున్న రుతురాజ్

గోవాతో జరుగుతున్న మ్యాచ్‌లో మహారాష్ట్ర బ్యాటింగ్ ముగిసింది. 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఒక దశలో మహారాష్ట్ర 52 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (134౽; 131 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) జట్టును ఆదుకున్నాడు. ఎనిమిదో స్థానంలో వచ్చిన విక్కీ ఓస్త్వాల్ (53; 82 బంతుల్లో) రాణించాడు. చివర్లో రాజవర్ధన్ హంగర్గేకర్ (32; 19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. గోవా బౌలర్లలో వాసుకి కౌశిక్ 3, అర్జున్ తెందూల్కర్, దీప్రాజ్ గాంకర్, దర్శన్ మిసల్, లలిత్ యాదవ్ తలో వికెట్ తీశారు.

# ఒక్క పరుగు తేడాతో పంజాబ్ సంచలన విజయం

**జైపూర్:** విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ సంచలన విజయం సాధించింది. గెలుపు ఆశల్లేని స్థితి నుంచి చివరి వరకు గొప్పగా పోరాడి ఒక్క పరుగు తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 45.1 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యఛేదనలో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ముంబయి సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. కానీ, వరుసగా వికెట్లు కోల్పోయి 26.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (62; 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు వృథ అయ్యాయి. పంజాబ్ కెప్టెన్ అభిషేక్ శర్మ వేసిన ఓవర్‌లో సర్ఫరాజ్ వరుసగా 6,4, 6,4,6,4 బాదేశాడు. అతను 15 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. టోర్నీ చరిత్రలో ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. కెప్టెన్ శ్రేయస్ (45; 34 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఒక దశలో 17.2 ఓవర్లకు 169/3 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచిన ముంబయి.. తర్వాత అనూహ్యంగా వికెట్లు కోల్పోయి ఓటమిని మూటగట్టుకుంది. సూర్యకుమార్ యాదవ్ (15), శివమ్ దూబె (12), హార్దిక్ తమోర్ (15) క్రీజులో ఎక్కువసేపు నిలవకపోవడం ముంబయిని కొంపముంచింది. పంజాబ్ ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం గమనార్హం. స్పిన్నర్ మయాంక్ మార్కండే (4/31) సత్తా చాటగా.. పేసర్ గుర్నూర్ బ్రార్ 57 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ అభిషేక్ శర్మ (8), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (11) విఫలమయ్యారు. రమణ్‌దీప్ సింగ్ (72) అన్మోల్‌ప్రీత్ సింగ్ (57) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఇప్పటికే ముంబయి, పంజాబ్ నాకౌట్ దశకు అర్హత సాధించాయి.



# 75%శాతం సంపాదనను ఇచ్చేస్తా

## కుమారుడి మరణం వేళ వేదాంతా ఛైర్మన్ పునరుద్ఘాటన

బిలియనీర్, గనుల రంగ దిగ్గజ సంస్థ వేదాంతా అధిపతి అనిల్ అగర్వాల్ కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) హఠాత్తుగా మృతి చెందిన సంగతి తెలిసిందే. కుమారుడి మరణంతో తన జీవితంలో చీకట్లు కమ్మాయని అనిల్ ఎక్స్ వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. అలాగే తమ సంపాదనలో 75 శాతాన్ని సమాజానికి ఇచ్చేస్తానని పునరుద్ఘాటించారు. "కుమారుడు అగ్నివేశ్ ఎంతో త్వరగా మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. అతడి వయసు 49 ఏళ్లే. భవిష్యత్తు గురించి ఎన్నో కలలుండేవి. అమెరికాలో జరిగిన స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో కోలుకుంటున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా.. ఎంతో ఒదిగి ఉండేవాడు. ఒక ఫ్రెండ్‌లా నా వెంటే ఉండేవాడు. దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందని బలంగా నమ్మేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి తిరిగిస్తానని అగ్నికి వాగ్దానం చేశాను. ఆ వాగ్దానాన్ని మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. అయితే, నువ్వు లేకుండా ఈ దారిలో ఎలా నడవాలో నాకు తెలియడం లేదు. కానీ నీ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను" అని రాసుకొచ్చారు. అనిల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియ ఉన్నారు. ఆమె వేదాంతా లిమిటెడ్ బోర్డు మెంబర్. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. వేదాంతా అనుబంధ సంస్థ తల్వండి సోబో పవర్ లిమిటెడ్‌కు అగ్నివేశ్ ఛైర్మన్. అనిల్ అగర్వాల్ నికర సంపద 330 కోట్ల డాలర్లు.

**ప్రధాని మోదీ సంతాపం..** అగ్నివేశ్ అకాల మరణంపై ప్రధాని నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు మీ కుటుంబానికి ధైర్యమివ్వాలని ప్రార్థిస్తున్నానంటూ అనిల్ అగర్వాల్ పోస్టుపై స్పందించారు.



# రహస్య సమాచారం లీక్..

## 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు సెబీ నోటీసులు..

భారత స్టాక్ మార్కెట్లకు చెందిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉల్లంఘించిందని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఆరోపించింది. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్టాక్ విక్రయాలకు సంబంధించిన డీల్ వేళ రహస్య సమాచారాన్ని లీక్ చేసిందని పేర్కొంది. అంతేగాక, ఈ వ్యవహారంపై దర్యాప్తును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిందంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికాకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత నవంబరులోనే ఈ నోటీసులను జారీ చేయగా.. తాజాగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెల్లడించింది. 2024 మార్చిలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ స్టాక్ విక్రయాలకు సంబంధించిన లావాదేవీలను భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించింది. ఈ విక్రయాల విలువ దాదాపు 177 మిలియన్ డాలర్లు. ఆ సమయంలో స్టాక్ ధర, ఇతర రహస్య వివరాలను బ్యాంకు డీల్ టీమ్.. ఉద్యోగులు, ఇన్వెస్టర్లతో పంచుకుందని ఓ ప్రజావేగు ఆరోపించారు. దీంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా అంతర్గత దర్యాప్తు జరిపి.. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ డీల్ విషయంలో అంతర్గత నైతిక కట్టుబాట్లను విస్మరించి బ్యాంక్ ఆఫ్ అమెరికా డీల్ టీమ్ రహస్య సమాచారాన్ని బయటపెట్టిందని సెబీ పేర్కొంది. వాస్తవాలను దాచి.. తప్పుడు స్టేట్‌మెంట్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆరోపించింది. అయితే, దీనిపై బ్యాంక్ ఆఫ్ అమెరికా గానీ.. సెబీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, ఈ వ్యవహారంపై సెటిల్‌మెంట్‌కు సెబీ వద్ద బ్యాంక్ ఆఫ్ అమెరికా అప్లికేషన్ దాఖలు చేసినట్లు సమాచారం.



# ప్రభాస్ మూవీ కాల్ వస్తే స్పామ్ కాల్ అనుకున్నా

### : మాళవిక

యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రజెంట్ 'రాజాసాబ్ మూవీలో నటిస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే ఈ మూవీ జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ క్రమంలో ప్రమోషన్స్ జోరు పెంచిన మాళవిక వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు మాట్లాడుతూ.. 'ప్రభాస్ సినిమాలో నటిస్తారా అని ఫోన్ వస్తే స్కామ్ కాల్ అనుకున్నాను. ఎందుకంటే స్టార్టింగ్‌లో హీరో విజఅబశ్రీశ్రీయ్ దేవరకొండతో నాకు సినిమాలో నటించే అవకాశం వచ్చింది.అయితే అప్పటికే అతనితో నాకు మంచి స్నేహం ఉండడం, మైత్రీ లాంటి పెద్ద నిర్మాణ సంస్థ ఆ సినిమాను ప్రొడ్యూస్ చేస్తుండడంతో సంతోషంగా ఆ మూవీ ఒప్పుకున్నాను. అయితే విజయ్ ఆ సినిమా బదులు లైగర్ చేయాలని అనుకోవడంతో కొంత షూటింగ తర్వాత ఆ సినిమా ఆగింది. అలా నా తెలుగు డెబ్యూ అప్పుడు మిస్సయింది.

# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు.






### 15ఏళ్ల కిందట ఆ సినిమా కూడా


# వర్కవుట్ కాదన్నారు : ప్రభాస్

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథనాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథనాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ-మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం"అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. "బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉ ంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడింది" అని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

### నేడు థియేటర్లలోకి

# ది రాజాసాబ్ మూవీ

### ప్రభాస్ అభిమానులకు సంక్రాంతి పండుగ




మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ-మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిందని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

### ఏపీలో పెరిగిన

# టిక్కెట్ ధరలు

### తెలంగాణలో తొలగని ఉత్కంఠ

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బ్జడెట్ మూవీ 'ది రాజా సాబ్' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది, మారుతి దర్శకత్వంలో హారర్-కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపు మరియు బెనిఫిట్ షోలకు సంబంధించి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా బెనిఫిట్ షోలకు, తర్వాత పది రోజుల పాటు టికెట్ రేట్లను పెంచుతూ ఒక జీవో జారీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ జీవో ఇంకా రాలేదు. రాత్రికే బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ వేయాల్సి ఉండగా ఆ జీవో ఇంకా రాలేదు. అయితే కోర్టు సమయం ముగిశాక ఆ జీవో జారీ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా ఏదైనా పెద్ద సినిమాకు ప్రభుత్వం రేట్లు పెంచుతూ జీవో ఇచ్చిన వెంటనే, కొందరు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల బుకింగ్స్ ఆగిపోవడం లేదా చివరి నిమిషంలో చిక్కులు ఎదురవడం వంటివి జరుగుతుంటాయి.ప్రభుత్వ జీవో వెలువడిన వెంటనే థియేటర్ యాజమాన్యాలు బుక్‌మైషో సహా ఇతర పోర్టల్స్‌లో బుకింగ్స్ జరిగేలా డేటాను అప్‌డేట్ చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం, నేడు సాయంత్రం 5:30 నుండి 6:00 గంటల మధ్య 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తిస్థాయిలో ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బెనిఫిట్ షోలకు (అర్ధరాత్రి లేదా తెల్లవారుజాము షోలు) కూడా లైన్ క్లియర్ అయింది. ఆంధప్రదేశ్‌లోని ప్రధాన కేంద్రాలలో ఈ షోల కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం అనుమతి కూడా దాదాపు ఖాయం కావడంతో ఇప్పుడు రికార్డు స్థాయి వసూళ్లపై చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.

## 'టాక్సిక్' సర్‌ప్రైజ్ వచ్చేసింది.. 'రాయ'గా రాక్‌స్టార్

'కేజీయఫ్' చిత్రాల తర్వాత యశ్ నటిస్తోన్న సినిమా 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. నేడు ఈ రాక్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. యశ్ లుక్‌ను విడుదల చేస్తూ గ్లింప్స్‌ను రిలీజ్ చేసింది. ఇందులో యశ్ రాయ పాత్రలో నటిస్తున్నట్లు తెలుపుతూ పవర్‌ఫుల్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ వ్యక్తి చాలా ప్రమాదకరం అంటూ పాత్రను పరిచయం చేస్తూ వీడియోను షేర్ చేసింది. అయితే అందులో హింసతో పాటు మసాలా సీన్స్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతుండగా అభిమానులు యశ్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు

రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తిండిపోతుందంటూ నవ్వులు పూ-యిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.




# మన శంకర్ వరప్రసాద్ గారు నుంచి హుక్‌స్టెప్

చిరంజీవి కథానాయకుడి అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో 'హుక్ స్టెప్' సాంగ్‌ను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను టెలికాస్ట్ చేయగా, అభిమానులే కాదు, వెంకటేశ్, అనిల్ రావిపూడి కూడా ఈ పాటకు డ్యాన్స్ వేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈపాటను బాబా సెహగల్ ఆలపించారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల్లో ఇదే హైలైట్ కావడం గమనార్హం. అంతేకాదు, సోషల్‌మీడియాను కూడా ఓ ఊపు ఊపేయడం ఖాయం.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com